ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

శుక్రవారం 25 అక్టోబరు 2024

నిధుల మంజూరుపై సంబరాలు

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిళ్ళలో గురువారం మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే విజయరమణారావు, అందుకు సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞత సమావేశం ఏర్పాటు చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పలువురు నాయకులను గ్రామస్తులు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు గాజనవేన సదయ్యను సన్మానించారు.కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు గాజనవేన సదయ్య, సింగిల్‌విండో ౘైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ మునీర్, నాయకులు రావి సదానందం, ఆటికం శంకర్‌గౌడ్, తిరుపతిరెడ్డి, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



పుట్నూర్ పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

- పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో తనిఖీలు

8



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి స్వప్నరాణి

సైబర్ నేరాల బారినపడి మోసపోవద్దు..

- న్యాయ విజ్ఞాన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి స్వప్నరాణి

8

ఉపాధి పెంపుపై దృష్టి



- జోరుగా పనులు కల్పిస్తేనే గ్రామాల అభివృద్ధి..
- 22.52 లక్షల పని దినాలకు 22.13 లక్షలు పూర్తి
- రూ.45 కోట్ల మెటీరియల్ కంపోనెంట్ లక్ష్యంగా ముందుకు
- 30 లక్షల పని దినాలు పూర్తి చేయించాలని ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఉపాధిహామీ పనుల్లో మరింత వేగం పెంచడంపై అధికారులు దృష్టి సారించారు. ఉపాధిహామీ పనులు జోరుగా సాగితేనే గ్రామాలు మరింత అభివృద్ధి చెందనున్నాయి. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో కూలీలకు ఎంత మొత్తంలో పనులు కల్పిస్తే అందులో 40 శాతం నిధులు మెటీరియల్ కంపోనెంట్ కింద కేటాయించనున్నారు. ఆ నిధులతో గ్రామాల్లో నిత్యం ప్రజలకు ఉపయోగపడే శాశ్వత నిర్మాణ పనులను చేపట్టే అవకాశాలుంటాయి. జిల్లాలో ఈ ఏడాది జరుగుతున్న గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో మరింత వేగం పెంచడంపై అధికారులు దృష్టి సారించారు. ప్రభుత్వం ఈ ఏడాదికి 22 లక్షల 52 వేల పని దినాలు కేటాయించగా, ఇప్పటి వరకు 22 లక్షల 13వేల పని దినాలను కూలీలు సద్వినియోగం చేసుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా ఐదు మాసాల గడువు ఉంది. అప్పటివరకు నిర్దేశించిన లక్ష్యానికి మించి కూలీలకు పనులు కల్పించాలని అధికారులు భావిస్తున్నారు.

ఈ మేరకు కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికార యంత్రాంగంతో సమీక్షా సమావేశం నిర్వహించి మొత్తం 30 లక్షల పనిదినాలను పూర్తిచేయాలని, తద్వారా సుమారు 45 కోట్ల రూపాయలకు పైగా మెటీరియల్ కంపోనెంట్ జనరేట్ అవుతుందని, వీటితో జిల్లాలో పెద్దఎత్తున శాశ్వత నిర్మాణ పనులు చేసుకోవచ్చని భావిస్తున్నారు. ఆ మేరకు క్షేత్రస్థాయిలో జిల్లాలో ఉన్న ఉపాధిహామీ కూలీలను ప్రోత్సహించి పనులు చేయించాలని ఆదేశించారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కూలీలను ప్రోత్సహించే పనిలో నిమగ్నం అయ్యారు. గ్రామాల్లో కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడాన్ని నివారించడానికి కేంద్రంలో అధికారంలో ఉన్న అప్పటి యూపీఏ ప్రభుత్వం 2005-06 గ్రామీణ ఉపాధిహామీ పథకానికి చట్టబద్ధత కల్పించింది. జాబ్ కార్డులు కలిగి ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజుల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

జిల్లాలో లక్షా 19వేల జాబ్ కార్డులు..

జిల్లాలో లక్షా 19వేల జాబ్ కార్డులను జారీ చేయగా, వీటి ద్వారా 2లక్షల 44 వేల కూలీలు నమోదై ఉన్నారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లో ఏడాదికి సరిపడా పనులను గుర్తించి పనులు చేస్తారు. కూలీల కోసం చెరువుల్లో పూడిక తీత, కట్టల అభివృద్ధి, కాలువల తవ్వకాలు, కాంటూర్ కందకాలు, సోక్ పిట్లు, ఇంకుడు గుంతల తవ్వకాలు, పొలాల వద్దకు ఫార్మేషన్ రోడ్లు, వన మహోత్సవం కోసం నర్సరీల్లో మొక్కలు పెంచడం, మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వడం వంటి పలు రకాల పనులు చేస్తుంటారు.

2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం 22 లక్షల 52 వేల పనిదినాలను కూలీలకు కల్పించగా, ఇప్పటి వరకు 22 లక్షల 13 వేల పని దినాలను కూలీలు సద్వినియోగం చేసుకున్నారు. ఈ పనులకు 59 కోట్ల 21 లక్షల రూపాయలు ఉపాధిహామీ పనుల కింద వెచ్చించారు.

ఇందులో కూలీలు 50 కోట్ల 4 లక్షల రూపాయల విలువైన పనులు చేయగా, మెటీరియల్ కింద 5 కోట్ల 65 లక్షల 95 వేల రూపాయలు, మిగతా రూపాయలు, అడ్మినిస్ట్రేషన్ కింద ఖర్చు చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో 86 కోట్ల 49 లక్షల రూపాయల విలువైన పనులు జరగగా, 44 కోట్ల 82 లక్షల రూపాయలు కూలీల కోసం వెచ్చించగా, 36 కోట్ల రూపాయల విలువైన మెటీరియల్ కంపోనెంట్ కింద పనులు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 30 లక్షల పని దినాలు పూర్తిచేస్తే లేబర్ కంపోనెంట్ 75 కోట్ల వరకు చేరనున్నదని, తద్వారా 45 కోట్ల రూపాయలకు పైగా మెటీరియల్ కంపోనెంట్ పనులు చేసుకునే అవకాశాలున్నాయి.

మిగతా 8వ పేజీలో..

సాధారణ పౌరులకే 'ఫ్రెండ్లీ పోలీసింగ్'..

- సంఘ విద్రోహ శక్తులపై ఉక్కుపాదమే..
- భూ ఆక్రమణదారులపై పీడీ యాక్టు.. సిద్ధమవుతున్న జాబితా..
- ప్రజల భాగస్వామ్యంతోనే గంజాయి నియంత్రణ
- మహిళలపై జరిగే నేరాలకు శిక్షలు పడే విధంగా చర్యలు
- టాస్క్‌ఫోర్స్ దాడులు పెంచుతాం.. సీసీఎస్‌ను పటిష్టపరుస్తాం..
- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



కోల్‌సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధారణ పౌరులకేనని, సంఘ విద్రోహ శక్తులను ఉపేక్షించేది లేదని, రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో శాంతిభద్రతలు పూర్తిస్థాయిలో అదుపులో ఉన్నాయని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. నేరాలకు పాల్పడేవారు ఏ పార్టీ వారైనా, ఏ వర్గం వారైనా తమ దృష్టిలో సమానమేనని, అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంచిర్యాల పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని గుర్తించి చర్యలు తీసుకున్నామని, రౌడీషీట్లు తెరిచామన్నారు. భూ కబ్జాలకు పాల్పడే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని, ఈ మేరకు జాబితా కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. శాంతి భద్రతల విషయమై ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

ఆంధ్రజ్యోతి : కమిషరేట్‌లో శాంతిభద్రతల పరిస్థితి ఎలా ఉంది?

సీపీ : చాలా బాగుంది. పూర్తి స్థాయిలో అదుపులో ఉన్నాయి. పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లో ప్రశాంతమైన పరిస్థితులు ఉన్నాయి. మంచిర్యాల పట్టణంలో మాత్రం రాజకీయ వివాదాలు సృష్టించుకుంటున్నారు. గతంలో జరిగిన ఒక కేసు విషయంలో గడ్డపార విషయంలో వివాదమై యువత పరస్పర దాడులకు పాల్పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఏడుగురిపై రౌడీషీట్లు తెరిచాం. బాధ్యులకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి : ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పోలీస్ శాఖలో ఉదాసీనత పెంచిందా..?

సీపీ : ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధారణ పౌరులకే. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించవద్దని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. వారికి పోలీస్ తరహా కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : కమిషనరేట్‌లో పీడీ యాక్టులు నమోదు చేయడం లేదనే ఆరోపణలున్నాయి. నిజమేనా..?

సీపీ : ఇది వాస్తవమే. పీడీ యాక్టులకు సంబంధించి విధానం ఉంది. పకడ్బందీగా నమోదు చేయకపోతే నేరస్తులు అప్పీలుకు వెళ్లి బయటకు వస్తున్నారు. అక్రమ దందాలకు పాల్పడే వారు, గంజాయి స్మగ్లర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాం. భూకబ్జాలకు పాల్పడే వారిపై తప్పకుండా పీడీ యాక్టులు నమోదు చేస్తాం. జాబితా కూడా సిద్ధమైంది. నేరాలకు పాల్పడేవారు కాదు, వారిని ప్రోత్సహించే వారిపై కూడా కేసులు నమోదు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : శాంతి భద్రతల పరిరక్షణలో రాజకీయ జోక్యం పెరిగిందా?

సీపీ : శాంతిభద్రతల పరిరక్షణలో రాజకీయాలకు ఏ మాత్రం చోటులేదు. ఏ పార్టీ వారైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. చెన్నూరులో చెరువు మత్తడి పేల్చిన

మిగతా 8వ పేజీలో...

ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయండి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సూచించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రుల ఓటు నమోదును చేయించాలని, ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని సూచించారు. రామగుండం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గడప గడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, ఆయా డివిజన్ల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఈవోకు ఆత్మీయ సన్మానం

జూలపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యాధికారిగా పనిచేసిన ఎంఈవో కవిత ఇటీవల బదిలీ కాగా గురువారం మండల ఎమ్మార్సీ భవనంలో ఎంఈవో కవితను ఆయా గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో నూతన ఎంఈవో సరస్వతి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, రవిందర్, రాగమయి, అనంతరెడ్డి, బుల్లయ్య, అశోక్‌రాజ్, యోగింద్రప్రసాద్, కుమారస్వామి, ఉపాధ్యాయులు బొల్లం ప్రవీన్, స్వామి, రాజు, సునిత, రాజ్యలక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

ఎలిగేడులో వైద్య శిబిరం

ఎలిగేడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం పద్మపాణి సొసైటీ లింక్ వర్కర్ కవ్వంపల్లి సంపత్ ఆధ్వర్యంలో హెల్త్‌క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు నిస్సిక్రిష్టాన పంచాయతీ కార్యదర్శి అంజలి, సీహెచ్‌వో విజేందర్ రాజు, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మణ్, నాగమణి, ఏఎన్‌ఎం దేవేంద్ర, ఆశవర్కర్స్ శారద, కొప్పుల పద్మ, జోనల్ సూపర్‌వైజర్ లక్ష్మణ్, నరేందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మంథని నియోజకవర్గంలో ఉచితంగా ఇసుక ఇవ్వాలి

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

పెద్దపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి నియోజకవర్గంలో వలే మంథని నియోజకవర్గంలో కూడా స్యాండ్ ట్యాక్సీని రద్దు చేసి ప్రజలకు ఉచితంగా ఇసుక ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. గురువారం ఆయన కలెక్టర్ కోయ శ్రీహర్షను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మంథని ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ ప్రాంతంలో ఉన్న ఇసుక తాతముత్తాత ఆస్తియా, ఇసుకను డబ్బులకు ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారని మాట్లాడారని, ఇప్పుడు ఆయన చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. రాజాపూర్‌లో ఇసుక అక్రమ రవాణావల్ల ఒకరు మరణిస్తే, ఆ కుటుంబాన్ని పరామర్శించారే తప్ప చేసిందేమి లేదని మహదేవ్‌పూర్ మండలం బెగులూరులో ఇసుక దాహానికి కాంగ్రెస్ కార్యకర్త మరణిస్తే కేవలం 7 లక్షలే పరిహారం ఇప్పించారని, తమ హయాంలో 20 లక్షలు ఇప్పించామని చెప్పారు. స్థానిక అవసరాలకు ఇసుక దొరకడం లేదని, మూడింతల డబ్బు వెచ్చించి ఇసుక కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు పెద్దఎత్తున తరలిస్తున్నారని ఆరోపించారు. వ్యవస్థలపై నమ్మకం లేదని మాట్లాడిన శ్రీధర్‌బాబు స్థానిక అవసరాలకు ఇసుక ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పెద్దపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కూడా అధికార పార్టీకి చెందిన వారేనని, ఆయన స్థానిక అవసరాలకు స్యాండ్ ట్యాక్సీతో సంబంధం లేకుండా ఉచితంగా ఇసుకను అందించే విధంగా ఏర్పాట్లు చేశారని, మంథని నియోజకవర్గ ప్రజలకు ఎందుకు ఉచితంగా ఇవ్వరని అన్నారు. ఆయన స్థానికంగా నివాసం ఉంటే ప్రజల సమస్యలు తెలిసేవని, మంథని ప్రజలపై ప్రేమ లేదని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడిన మాటలను శ్రీధర్‌బాబు గుర్తుకు తెచ్చుకుని పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా ఇసుకను అందిస్తున్నట్లుగానే మంథని నియోజకవర్గ ప్రజలకు అందించాలని పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు తగరం శంకర్ లాల్, ఎగోళపు శంకర్‌గౌడ్, పూదరి సత్యనారాయణ, ఘైదం కుమార్, శెంకేసీ రవీందర్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

బీసీ కమ్యూనిటీ హాల్ కోసం స్థలం కేటాయించాలి

మంథని, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ౘైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్ రెడ్డి, కమిషనర్ మనోహర్‌లను కోరుతూ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్‌జీ గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. భవన నిర్మాణం కోసం మంత్రి శ్రీధర్‌బాబు రూ.5లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. రోడ్‌లో సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న భూమిలో స్థలం కేటాయించాలని కోరారు. మంథనిలో 60శాతానికి పైగా ఉన్న బీసీల కోసం ఏర్పాటు చేసే భవానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వెంట బీసీ నేతలు వీకే. రవి, పర్శవేన మోహన్, మంథని వేణులు ఉన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- గోదావరిఖని ఏసీపీ రమేష్



మాట్లాడుతున్న గోదావరిఖని ఏసీపీ రమేష్

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 24: విద్యార్థులకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అన్నారు. గురువారం సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో షీటీమ్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఒక్కసారి డ్రగ్స్‌కు బానిసైతే జీవితాంతం బాధపడాల్సి వస్తుందని, మెడికల్ విద్యార్థులు దేశ భవిష్యత్‌లో ఎంతో ఉపయోగమని, చదువుల్లో రాణించి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, మహిళల భద్రత కోసం పోలీస్‌శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హిమబిందు, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, టుటౌన్ సీఐ ప్రసాద్‌రావు, ప్రొఫెసర్లు అనంతబాబు, కల్పన, అశోక్ వర్ధన్, షరీఫ్, ఆసీఫ్, షీటీమ్ ఇన్‌చార్జి నెల్లూరు మల్లయ్య పాల్గొన్నారు.

పోలీసులు సమాజ సేవకు అంకితం..

మంథని (ఆంధ్రజ్యోతి) : సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అంకితమై విధులు నిర్వహిస్తుంటారని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అన్నారు. స్థానిక పోలీసు స్టేషనల్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఓపెన్ హౌజ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి శాంతి భద్రతల సమస్య ఎదురైనా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజు, ఎస్ఐ రమేష్‌లు పాల్గొన్నారు.

అవార్డు అందజేత

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్కైలైఫ్ ఫౌండేషన్, శారద ఎడ్యుకేషన్ సొసైటీలు అంతర్జాతీయ ఉపాధ్యాయ అవార్డు ప్రదానోత్సవాన్ని హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియంలో సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జడ్పీహెచ్ఎస్ నిట్టూరులో హిందీ బోధిస్తున్న ఎండి హఫీజ్‌ను రాష్ట్రస్థాయి టీచర్స్ ఎక్సలెన్సీ అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు. హఫీజ్‌కు అవార్డు రావడంపై రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు సట్టు కనుకయ్య, ప్రధాన కార్యదర్శి సమీ, జిల్లా భాషా పండితులు శంకర్, రాజన్న, ఫాజిల్, సాధిక్, రమణారెడ్డి తదితరులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

క్రైం కార్నర్

వాహన తనిఖీల్లో గంజాయి పట్టివేత

గంగాధర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం రాత్రి వాహనాల తనిఖీల్లో కిలో 70 గ్రాముల గంజాయిని పట్టుకున్నామని చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. గంగాధరలో బుధవారం అర్ధరాత్రి ఎస్సై నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో యాసిన్, కొత్తపల్లి ఆదిత్య, వాజీదిపాషా అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని ప్రశ్నించగా గంజాయి అమ్ముతున్నామని తెలిపారు. తనిఖీ చేయగా కిలో 70 గ్రాముల గంజాయి పట్టుబడింది. వీరు నాగపూర్ నుంచి కొనుగోలు చేసి తాము తాగుతూ మండలంలోని చుట్టు పక్కల గ్రామాల్లోని యువత, కార్మికులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. పట్టుబడిన గంజాయి విలువ 26, 170 రూపాయలు ఉంటుందని, ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. గంజాయిపై ఉన్నతాధికారుల సూచన మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు వ్యక్తులు వేర్వేరు చోట్ల ఆత్మహత్యకు పాల్పడ్డారు. భూమి విషయంలో మనస్తాపం చెంది ఒకరు, అప్పుల ఒత్తిడి భరించలేక ఒకరు, ఇష్టం లేని పెళ్లి చేశారని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు.


నర్సయ్య(ఫైల్)

కోల్‌సిటీ, అక్టోబరు 24: గోదావరిఖనికి చెందిన సింగరేణి కార్మికులు మాలంశెట్టి నర్సయ్య(49) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరీంనగర్‌లో కొందరు బ్రోకర్లు నమ్మించడంతో రూ.80లక్షలు అప్పు చేసి భూమిని కొనుగోలు చేశాడు. తరువాత ఆ స్థలం వివాదంలో ఉందని తెలియడంతో పలుమార్లు సెటిల్‌మెంట్లకు ప్రయత్నించాడు. రెండు రోజుల క్రితం కరీంనగర్‌కు వెళ్లి సెటిల్‌మెంట్ కోసం చర్చలు జరిపాడు. అతడితో భూమి కొనుగోలు చేయించిన సర్వ శ్రీనివాస్ అనే వ్యక్తి సహకరించకపోగా, ఎదుటి వారి పక్షాన మాట్లాడినట్టు నర్సయ్య మదనపడ్డాడు. బుధవారం తెల్లవారు జామున ఇంట్లో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గోదావరిఖని విఠల్‌నగర్ పోస్టాఫీస్ వద్ద సింగరేణి క్వార్టర్లలో నర్సయ్య నివాసముండేవాడు. అత డికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు గతంలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్న కుమారుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

అప్పుల ఒత్తిడితో బెహరాన్‌లో వేంపేట వాసి..


సుధీర్(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన యువకుడుఅప్పుల ఒత్తిళ్ల నేపథ్యంలో బెహరాన్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వేంపేటకు చెందిన మారంపల్లి సుధీర్ (35)కు భార్య ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. జీవనోపాధి కోసం రెండున్నరేళ్ల క్రితం సుధీర్ బెహరన్ వెళ్లాడు. కుటుంబ పోషణ కోసం తీసుకున్న అప్పులు ఇచ్చిన వారి ఒత్తిళ్లు ఎక్కువ య్యాయి. దీంతో బెహరాన్‌లో నివా సం ఉం టున్న తన గదిలోనే బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు స్నేహి తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సుధీర్ మృతి చెంది ఉన్న ఫొటోలు చూసి ఆయన మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుధీర్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గ్రామస్థులు కోరారు.

ఇష్టం లేని పెళ్లి చేశారని యువకుడు..

గంగాధర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం నారాయణపూర్‌కు చెందిన యువకుడు ఇష్టంలేని పెళ్లి చేశారని బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చింతలతాడేపు మహేష్(29)కు ఆరు నెలల క్రితం వివాహం జరిగింది. కాగా తనకు ఇష్టలేని వివాహం చేశారని మనస్తాపంతో బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మహేష్ తల్లి దేవవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సైబర్ వలలో జిల్లా యువత

- ఉపాధి కోసం లావోస్ వెళ్లి తిరిగి రాక
- ఏజెంట్ మోసంపై ఎస్పీకి ఫిర్యాదు


ఎస్పీ కార్యాలయానికి వచ్చిన బాధితులు

రాయికల్/ జగిత్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి కరువై ఇతర దేశాల్లో ఉపాధి కోసం వెళ్తే ఏజెంట్ల మాయ మాటలకు నిరుద్యోగ యువత మోసాలకు గురవుతున్నారు. తాజాగా జగిత్యాల జిల్లాకు చెందిన పలువురు యువకులు సైబర్ వలలో చిక్కకుండా తిరిగి స్వదేశానికి వచ్చిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం రాయికల్ మండలం తాట్లవాయికి చెందిన చెట్లపల్లి మహేష్, గాండ్ల అనిల్ కుమార్, అల్లీపూర్‌కు చెందిన చెలుముల ప్రవీణ్, జగిత్యాలకు చెందిన అయ్యోరి మోహన్ రాయికల్ మండలానికి చెందిన ఓ ఏజెంట్ ద్వారా ఉపాధి కోసం లావోస్ వెళ్లడానికి ఒక్కొక్కరు రూ.1.50 లక్షలు చెల్లించారు. సెప్టెంబరు 30న నలుగురిని బ్యాంకాక్ తీసుకువెళ్లి అక్కడి నుంచి వాహనాల్లో లావోస్ తీసుకువెళ్లారు. అక్కడ డాటా ఎంట్రీ ఉద్యోగం అని చెప్పి నగరానికి దూరంగా ఉంచి శిక్షణ పేరుతో భారతదేశంలోని వ్యక్తుల నుంచి సైబర్ మోసాలు చేయడానికి మెళకువలు నేర్పిస్తున్నారు. గమనించిన యువకులు సైబర్ నేరాలు తాము చేయమని అక్కడి తెలుగు వారి సహాయంతో యువత అక్కడి నుంచి తప్పించుకుని తిరిగి స్వదేశానికి వచ్చారు. వచ్చిన అనంతరం ఏజెంట్‌ను కలిసి తమను మోసం చేశావని, తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా ఏజెంట్ పట్టించుకోకపోవడంతో బాధితులు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

ఆలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

మల్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వీపర్‌గా విధులు నిర్వహించే బక్కయ్య అనే ఉద్యోగి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రసాద కౌంటర్ వద్ద విధులు నిర్వహించే బక్కయ్యకు ఏళ్ల తరబడిగా కొండపైన నివాసముంటున్న ఓ భక్తురాలికి మధ్య నెల రోజుల క్రితం అల్పాహారం విషయమై వివాదం ఏర్పడడంతో బక్కయ్య దేవస్థానం అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇందుకు దేవస్థానం ఉద్యోగి ఒకరు భక్తురాలికి మద్దతు పలుకుతున్నారని ఆరోపించగా కొద్ది రోజుల తరువాత ఈ విషయం సద్దుమనిగింది. మళ్లీ రెండు రోజుల క్రితం ఆ భక్తురాలు ప్రసాద కౌంటర్ వద్దకు రావడంతో కౌంటర్‌లో విధులు నిర్వహించే మరో ఉద్యోగి, బక్కయ్యకు భక్తురాలి విషయమై మళ్లీ వాగ్వాదం చోటుచేసుకుంది. కాగ బక్కయ్య అదే రోజు క్రిమిసంహారక మందు తాగడంతో చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ తీసుకెళ్లారు. ప్రస్తుతం కోలుకుంటున్నట్లు ఆలయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ విషయం కొండపైన చర్చనీయాంశంగా మారింది. ఏళ్ల తరబడి తిష్ట వేసిన భక్తులతో ఆలయ ఉద్యోగుల్లో గొడవలు జరుగుతున్నట్లు పలువురు చెబుతున్నారు.

వావ్..వర్షిణి..

డ్యాన్సర్, గాయని, నటిగా రాణిస్తున్న 'ఖని' యువతి

ట్రెండింగ్



చిన్ననాటి నుంచి ఆమెకు డ్యాన్సంటే ప్రాణం... ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా తోడైంది.. సెకండ్ క్లాస్‌లో స్టేజీపై మొదలైన స్టెప్పులే... నేడు డ్యాన్సర్‌గా తన సత్తాను చాటుకుంటోంది. అంతేకాకుండా గాయనిగా... నటిగా... డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా రాణిస్తున్నది... ఆమె చేసే డ్యాన్స్ పాటకు ప్రాణం పోస్తుంది... వీక్షకులను హుషారెత్తిస్తుంది... తన టాలెంట్‌కు యూట్యూబ్‌లో లక్షల వ్యూస్‌తో దూసుకెళుతోంది. బుల్లితెరపై పలు షోలతో పాటు దేశవిదేశాల్లో ఎన్నో ప్రదర్శనలిస్తూ అందరి ప్రశంసలందుకుంటోంది గోదావరిఖని 'మహానటి'గా గుర్తింపు తెచ్చుకున్నది వరుమణి వర్షిణి..

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన వరుమణి వర్షిణి డ్యాన్సర్‌గా, గాయనిగా, నటిగా రాణిస్తూ అందరి ప్రశంసలందుకున్నది. ఫోటో తీస్తున్నడే సీమ దసరా చిన్నోడు అంటూ సాగే పాటలో అదిరిపోయే స్టెప్పులతో వీక్షకులను ఉర్రూతలూగించింది వర్షిణి. ఈ పాటకు యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్ వచ్చాయి.

వర్షిణి ప్రస్తానం..:

డ్యాన్స్ ప్రదర్శనలిస్తూనే 2021లో రీల్స్ చేయడంతో పాటు యూట్యూబ్‌లో వివిధ ప్రైవేట్ ఆల్బమ్స్‌లో నటించింది. వర్షిణి నటించిన ఖద్దరు చొక్కా, నాయిదోరో..చిన్నదోర, ఫోటో తీస్తున్నాడే సీమ దసరా చిన్నోడు పాటలు విశేషంగా ఆదరణ పొందాయి. యూట్యూబ్‌లో తన పాటలతో మిలియన్‌లలో వ్యూస్ రావడంతో గత సంవత్సరం ఆమెకు జబర్దస్త్ టీవీ షోలో నటించే అవకాశం వచ్చింది. అలాగే శ్రీదేవి డ్రామా కంపెనీ షోలో పలు ప్రదర్శనలు ఇస్తూ విశేష ఆదరణ పొందుతున్నది. అంతేకాకుండా త్వరలో విడుదల కానున్న ఓ చిత్రంలో హీరోయిన్ పాత్రకు డబ్బింగ్, మరో రెండు సినిమాలలో సైడ్ క్యారెక్టర్‌గా నటిం చింది. ప్రస్తుతం తెలుగు, తమిళ్, కన్న డం మూడు భాషాల్లో చిత్రీకరిస్తున్న చిత్రంలో వర్షిణి నటిస్తున్నది.

నటిగా.. ఉపాధ్యాయురాలిగా సేవలందించాలి..

వరుమణి వర్షిణి

మా అమ్మానాన్నలు వేణుమాధవ్, వాణి ప్రైవేట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం టీవీ షోలతో పాటు తెలుగు, తమిళ, కన్నడ చిత్రాల్లో నటిస్తున్నాను. మంచి నటిగా రాణిస్తూ గుర్తింపు పొందడంతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలన్నది నా లక్ష్యం.



టీవీ షోలో నటి ఇంద్రజతో డాన్స్ చేస్తున్న వర్షిణి, టీవీ షోలో వ్యాఖ్యాతగా...


సాంగ్ షూటింగ్‌లో..

కేర్‌టేకర్‌గా వచ్చి చోరీ

జగిత్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేర్‌టేకర్‌గా వచ్చి ఇంట్లో వారితో నమ్మకంగా మెదిలిన ఓ వ్యక్తి ఆ ఇంటికే కన్నం వేశాడు. జిల్లా కేంద్రంలోని బీట్ బజార్ ప్రాంతానికి చెందిన కోటగిరి శ్రీనివాస్ తన తండ్రి చంద్రశేఖర్‌కు సర్జరీ కావడంతో కేర్‌టేకర్ కోసం హైదరాబాద్‌లోని వశిష్ట హోం కేర్ సర్వీసెస్‌ను సంప్రదించాడు. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం దొంతమూరు గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి రాజు అనే వ్యక్తిని నెలకు రూ. 22 వేల వేతనంతో కేర్‌టేకర్‌గా శ్రీనివాస్ ఇంట్లో నియమించింది. మూడు నెలల పాటు నమ్మకంగా పనిచేసిన రాజు 20 రోజుల క్రితం స్వగ్రామం వెళ్లాడు. బుధవారం జగిత్యాలకు వచ్చి శ్రీనివాస్ ఇంట్లో తిరిగి పనిచేస్తానంటూ నమ్మించాడు. రాత్రి సమయంలో బీరువాలో ఉన్న రూ. 99,500 నగదును అపహరించుకవెళ్లాడు. ఇంట్లో ఉండాల్సిన రాజు కనబడకపోవడంతో సీసీ పుటేజీల ద్వారా చోరికి పాల్పడ్డట్లు గుర్తించారు. జరిగిన సంఘటనపై బాధితుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆసుపత్రిలో చోరీ...

జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న సాయినీస్ డెంటల్ కేర్ ఆసుపత్రిలో బుధవారం చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆసుపత్రి కిటికీలు పగులగొట్టి రూ. 55 వేల విలువగల ఐఫోన్‌తో పాటు విలువైన వస్తువులు అపహరించుకవెళ్లారు. అభిషేక్ రాజ్ ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్యజ్యోతి): తలకు గాయాలతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కరీంనగర్ మారుతినగర్‌కు చెందిన ఎండీ అక్బర్ ఖాన్(44) గురువారం ఉదయం మృతి చెందాడని కరీంనగర్ మూడో ఠాణా పోలీసులు తెలిపారు. అక్బర్ ఖాన్ పెయింటర్‌గా పనిచేస్తుం డేవాడని, ఇటీవల మద్యం సేవించి పడిపో తుండేవాడని కుటుంబ సభ్యులు పోలీసు లకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 15 రోజుల కిందట తలకు గాయం కాగా మళ్లీ ఈ నెల 21న కిందపడటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లగా కరీంనగర్ ప్రభుత్వ ఆసు పత్రిలో చికిత్స అందించినట్లు తెలిపారు. అనంతరం ఎంజీఎంకు తరలించి వైద్యం అందిస్తుండగా మృతి చెందాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

దైవారాధనతోనే సత్ఫలితాలు

నైమిశారణ్య పీఠాధిపతి పూజలు


స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో శ్రీనివాస్

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దైవారాధన ద్వారానే సత్ఫలితాలు సాధ్యమవుతాయని నైమిశారణ్య పీఠాధిపతులు బాల బ్రహ్మా నంద సరస్వతి స్వామి అన్నారు. ప్రతి వ్యక్తి భగవంతుడిని నిత్యం పూజించాలని తెలిపారు. ధర్మపురి క్షేత్రంలో స్వామి గురువారం ఉదయం ప్రవచనాలు చేశారు. లక్ష్మీ నరసింహ స్వామి వారి లీలా విలాసనం గురించి ప్రవచనాలు చేశారు. అంతకు ముందు స్వామి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయం వద్ద పీఠాధిపతులకు అధికారులు, వేదపండితులు, అర్చకులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించారు. అంతకు ముందు ఆయన యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీ పంలో నూనె పోశారు. ఆయన వెంట ఆలయ ఈవో సంక టాల శ్రీనివాస్, వేదపండితులు పాల్గొన్నారు.

యాపిల్‌ఫోన్ నకిలీ విడిభాగాల అమ్మకాలు

- 4 మొబైల్ షాపులపై కేసులు నమోదు


మొబైల్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రాజన్న

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో యాపిల్ మొబైల్‌ఫోన్ బ్రాండ్‌తో షాపుల్లో వినియోగ దారులకు విక్రయిస్తున్న నకిలీ మొబైల్ విడిభాగాలు, అనుబంధ పరికరాలు పట్టుబడ్డాయి. యాపిల్‌ఫోన్‌కు అనుబంధమైన పవర్ ఎడాప్టర్, ఇయర్‌బర్డ్స్, లైటింగ్ కేబుల్, బ్యాక్ కవర్లు బ్రాండెడ్‌గా చూపుతూ వ్యాపారులు విక్రయిస్తున్నట్లు ఆపిల్‌ఫోన్ కంపెనీ ఫిర్యాదుతో కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ ఆధ్వర్యంలో షాపులలో తనిఖీలు నిర్వహించగా పలు రకాల నకిలీ పరికరాలు పట్టుబడ్డాయి. యాపిల్ ఫోన్ కంపెనీకి సంబంధించిన పేరుతో నకిలీ పరికరాలు, విడిభాగాలు విక్రయిస్తున్న అన్నపూర్ణ కాంప్లెక్స్‌లోని పంచరతన్ మార్కెటింగ్‌షాపు. శ్రీజ మొబైల్ స్పేర్‌పార్ట్స్, మహాలక్ష్మి సెల్ వరల్డ్, చాముండా మొబైల్ షాపుల యజమానులపై కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు. నకిలీ విడిభాగాలు, పరికరాలను సీజ్ చేశామనిని, అక్రమాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం రెండో బైపాస్ రోడ్డు చంద్రంపేట చౌరస్తా వద్ద గురువారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదు రుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఇదే సమ యంలో పెట్రోలింగ్ చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. బైపాస్ రోడ్డులోని చంద్రంపేట చౌరస్తా వద్ద చీకటిగా ఉండడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

ఉపకార వేతనం.. భవితకు ఊతం..

పేద విద్యార్థులకు వరంగా ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్

సమాచారం



చదువుకోవాలనే తపన ఉన్న విద్యార్థులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు విధాలుగా ప్రోత్సహిస్తున్నాయి. చదువులో ప్రతిభ ఉన్న విద్యార్థుల కోసం ఉపకార వేతనాలు అందిస్తున్నాయి. అటువంటిదే కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్ఎంఎంఎస్). ఈ ఉపకార వేతనాన్ని జాతీయ స్థాయిలో పరీక్ష నిర్వహించి అందజేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. అర్హత సాధించిన విద్యార్థులు తొమ్మిదో తరగతి నుంచి ఐదు సంవత్సరాలపాటు 12 వేల రూపాయల చొప్పున స్కాలర్‌షిప్ పొందవచ్చు.

హుజూరాబాద్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చదుకోవాలనే తపన ఉన్నా.. ఆర్థిక స్థోమత లేక ఎంతోమంది విద్యార్థులు తమ చదవులను అర్ధంతరంగా ఆపేసిన సంఘటనలు ఉన్నాయి. ఈ తరుణంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఊతం అందిస్తోంది. వీటిని అందిపు చ్చుకుని ఉన్నత విద్యను అభ్యసిస్తూ.. ముందు కు సాగుతున్నారు. పరీక్షలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపకార వేతనాలు (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం - ఎన్ఎంఎంఎస్) అందిస్తోంది.

నాలుగేళ్లపాటు ఉపకారం అందుకుంటూ ఉన్నత చదువులు చదివే అవకాశముంది. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జాతీయస్థాయిలో పరీక్ష ఉంటుంది. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఏటా 12 వేల రూపాయల చొప్పున తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం వరకు ఐదేళ్ల పాటు ఉపకార వేతనం అందిస్తారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. నవంబరు 24న పరీక్ష నిర్వహిస్తారు.

పరీక్ష స్వరూపం

పరీక్షలో మొత్తం 180 మార్కులకు రెండు విభాగాలు ఉంటాయి. పార్ట్-1 మానసిక సామర్థ్య పరీక్ష. ఇందులో 90 ప్రశ్నలకు 90 మార్కులుంటాయి. రీజనింగ్, ఎబిలిటిస్, సంఖ్యా శాస్త్రం, పదాల భిన్న పరీక్ష, నంబర్, అనాలజీ, అల్ఫాబెట్ అనాలజీ, కోడింగ్ డీకడింగ్, లాజికల్ ప్రశ్నలు, వెన్‌చిత్రాలు, మిర్రర్ ఇమేజెస్, వాటర్ ఇమేజెస్ అంశాల్లో ప్రశ్నలు ఉంటాయి. వీటిని సాధన చేయాలి. పార్ట్-2లో ఏడు, ఎనిమిదో తరగతి సిలబస్ నుంచి 90 ప్రశ్నలుంటాయి. 90 మార్కులుంటాయి. గణితం 20 మార్కులు, భౌతిక, రసాయన, జీవ శాస్త్రం కలిపి 35 మార్కులుంటాయి. పరీక్ష ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో మల్టిపుల్ చాయిస్ రూపంలో ఉంటుంది.

న్యూస్ బాక్స్

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు హృతికేశ్ ఎంపిక


పతకం అందుకుంటున్న హృతికేశ్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు జిల్లాకు చెందిన వంగల హృతికేశ్ ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో ఈ నెల 18, 19, 20 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభచాటి రజత పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ వేణుగోపాలక్ష తెలిపారు. ఈ సందర్భంగా హృతికేశ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ వై సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ బి మధుసూదన్‌రెడ్డి అభినందించారు.

28న జాబ్ మేళా

గణేశ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ టాస్క్(తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్‌సెంటర్) ఆధ్వర్యంలో ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కల్వకుంట రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. డిగ్రీ లేదా ఇంటర్ పాసైన వారు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. కనీస వయస్సు 28 సంవత్సరములు దాటకూడదని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భగ్గుమన్న విభేదాలు

- ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అనుచరుల పరస్పర దాడులు
- పలువురిపై కేసు నమోదు

జగిత్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అనుచరుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. అనుచరుల మధ్య జరిగిన ఓ భూ వివాదంలో ఒకరిపై మరొకరు దాడి చేసుకోగా జగిత్యాల రూరల్ ఠాణాలో కేసులు నమోదయ్యాయి. జగిత్యాల పట్టణంలోని ఒకటవ వార్డు కౌన్సిలర్ కూసరి అనీల్, జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన బండారి వెంకటరాజంలకు మధ్య తిప్పన్నపేట గ్రామ శివారులో ఉన్న భూముల విషయంలో కొన్ని రోజులుగా తగాదాలు నడుస్తున్నాయి. ఈనెల 18వ తేదీన శుక్రవారం ఇదే భూమి విషయంలో వెంకట రాజం, అనీల్‌కు మధ్య వివాదం ముదిరి ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. దీంతో ఇరు వర్గాలు జగిత్యాల రూరల్ పోలీసులకు అదే రోజు ఫిర్యాదు చేయగా పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. అయితే కౌన్సిలర్ కూసరి అనీల్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అనుచరుడిగా గుర్తింపు ఉండగా, బండారి వెంకట్రాజం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మనిషి కావడంతో ఈఘటన జగిత్యాలలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మూడు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రధాన అనుచరుడు మారు గంగారెడ్డి హత్య సంచలనం సృష్టించింది. ఆయన హత్యకు భూ వివాదమే కారణమని భావిస్తున్నారు. ఈ ఘటన మరవకముందే మరో భూ వివాదం వెలుగులోకి రావడంతో చర్చనీయాంశంగా మారింది.

చిన్న కొడుకుకు తండ్రి భూమి పట్టా చేసే యత్నం

- అడ్డుకున్న మిగతా కొడుకులు


పురుగుల మందు డబ్బా తీసుకుంటున్న పోలీసులు

ఇల్లందకుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు కొడుకులు ఉన్నప్పటికీ ఓ తండ్రి తన పేరిట ఉన్న 1.08గుంటల భూమిని గురువారం చిన్న కొడుకుకు పట్టా చేసే యత్నం చేయగా మిగతా ఇద్దరు కుమారులు పురుగుల మందు డబ్బా చేతిలో పట్టుకుని అడ్డుకున్న సంఘటన ఇల్లందకుంట తహసీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకుంది. ఇల్లందకుంట మండలంలోని శ్రీరాముల పల్లి గ్రామానికి చెందిన అంబరిగుంట రాము లుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇతడికి సర్వే నంబర్ 180లో 19.08ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో నుంచి ముగ్గురు కొడుకులకు 6ఎకరాల చొప్పున గతంలోనే వాటాలు పంచాడు. మిగితా 1.08గుంటల భూమి రాములు పేరిట ఉంది. ఆ భూమిని చిన్న కొడుకు అయిన తిరుపతికి పట్టా చేసేందుకు సేల్ డీడీతో గురువారం తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. విషయం తెలుసుకున్న మిగితా ఇద్దరు కుమారులు శ్రీనివాస్, సంజీవరావు తమ కుటుంబ సభ్యులతో కలిసి పురుగుల మందు డబ్బాలతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అందరికి సమానంగా రావాల్సిన భూమిని తమ్ముడు ఒక్కడికి చేయవద్దని తహసీల్దార్ రాణిని కోరారు. కొంతసేపు తండ్రి ముగ్గురు కొడుకులు ఘర్షణ పడ్డారు. తహసీల్దార్ రాణి రాములకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా చిన్న కొడుకు ఒప్పుకోలేదు. దీంతో తహసీల్దార్ పోలీస్‌లకు సమాచారం అందించారు. పోలీసులు రాములుతో పాటు కుటుంబ సభ్యులను స్టేషన్‌కు తరలించారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

కోనరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలం లోని శివంగాలపల్లిలో పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. వెంటనే వారిని సిరిసిల్ల జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివంగాల పల్లి గ్రామానికి చెందిన బిజ్జం ధర్మయ్య, వాణి, అంజి, శ్రీకాంత్‌పై పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. వెంటనే గ్రామస్థులు పిచ్చి కుక్కను చెదరగొట్టి గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో..

- మూడు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారుల సమావేశం
- సరిహద్దుల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు
- సమాచారం మార్పిడి చేసుకోవాలని నిర్ణయం



సమావేశానికి వెళుతున్న రామగుండం సీపీ, ఐజీ శ్రీనివాస్

కోల్‌సిటీ, అక్టోబరు 24: మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో మూడు రాష్ట్రాల సహరిహద్దు జిల్లాల పోలీస్ అధికారుల సమావేశం గురువారం గడ్చిరోలి ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి రామగుండం పోలీస్ కమిషనర్, ఐజీ శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా రామగుండం నుంచి హెలికాప్టర్‌లో తీసుకెళ్లారు. శ్రీనివాస్ సమావేశానికి అధ్యక్షత వహించగా గడ్చిరోలి డీఐజీ అంకిత్ గోయల్, సీఆర్‌పీఎఫ్(ఆపరేషన్స్) డీఐజీ అజయ్ శర్మ, కనికెర్ ఎస్పీ కళ్యాణ్, ఎలెసెల, మోహాల మణిపూర్ ఎస్పీ వైపీ సింగ్, గడ్చిరోలి ఎస్పీ నిలోత్పల్, బాంద్ర ఎస్పీ నూరుల్ హసన్, చంద్రపూర్ ఎస్పీ ముమ్మక్క సుదర్శన్, గోండియా ఎస్పీ గోరక్ భమ్రే, భూపాల్‌పల్లి ఎస్పీ కిరణ్‌కారే, ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాస్‌లు, నారాయణపూర్ అడిషనల్ ఎస్పీ రాబిన్‌సన్, బీజాపూర్ అడిషనల్ ఎస్పీ దినేష్ సిన్హా తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలు, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. మావోయిస్టు కదలికలపై నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, పరస్పర సమాచారం మార్పిడి చేసుకోవాలని నిర్ణయించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు మూడు రాష్ట్రాల అధికారులు పరస్పర సహకారంతో మెదలాలని నిర్ణయించారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు జరుపాలని, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల సరిహద్దు ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. ఎన్‌బీడబ్ల్యూ విషయంలో ఇరు రాష్ట్రాల అధికారులు సమాచార మార్పిడి చేసుకోవాలని, ఒకరికొకరు సహకరించుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, గడ్చిరోలి ఎస్పీ(అడ్మిన్) రమేష్, ఆపరేషన్ డీఎస్పీ విశాల్‌నాగార్ గోగె, రామగుండం ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావుతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్‌కు చెందిన పలు జిల్లాల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారులకు ఓరియంటేషన్ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌నకు హాజరైన ఐదు జిల్లాల అటవీశాఖ అధికారులు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24: రాజన్న సిరిసిల్ల జోన్ పరిధిలోని ఐదు జిల్లాల అటవీశాఖ అధికారులకు కరీంనగర్ డీర్‌పార్క్‌లో గురువారం ఒక రోజు ఓరియంటేషన్ ట్రైనింగ్ నిర్వహించారు. అటవీ ప్రాంత అభివృద్ధికి చేపట్టాల్సిన పనుల ప్రణాళికను రూపొందించేందుకు ఈ ఒక రోజు శిక్షణ జరిగింది. 2025-26 నుంచి 2035-36 సంవత్సరం వరకు 10 ఏళ్లల్లో రాజన్నసిరిసిల్ల జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో మొక్కల పెంపకం, చెక్‌డ్యాంల నిర్మాణం, అటవీప్రాణుల సంరక్షణ, చెట్లు కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అటవీప్రాంతాల్లో వివిధ రకాల సర్వే చేసేందుకు ఈ శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణకు అటవీశాఖ జియోమాటిక్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టం(జీఐఎస్) నుంచి ఐఎఫ్ఎస్ అధికారి ఐ ప్రకాశ్, కరీంనగర్ డీఎఫ్ఓ సీహెచ్ బాలమణి, మెదక్ డీఎఫ్ఓ ఎం జోజి, కామారెడ్డి ఎఫ్‌డీఓ రామకృష్ణలు పాల్గొన్నారు. ఈ శిక్షణలో కరీంనగర్. సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలకు చెందిన ఫారెస్టు రేంజి ఆఫీసర్లు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, ఇతర అధికారులు 100 వరకు హాజరయ్యారు. 10 ఏళ్ల ప్రణాళికలను రూపొందించేందుకు ఈ శిక్షణ నిర్వహించామని అధికారులు తెలిపారు.

ఎస్‌యూ కబడ్డీ పోటీల విజేత వివేకానంద జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో ఈనెల 23న నిర్వహించిన ఉమ్మడి జిల్లా అంతర డిగ్రీ, పీజీ కళాశాలల కబడ్డీ టోర్నమెంట్‌లో వివేకానంద డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొనగా, ఫైనల్‌లో ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాల జట్టుపై వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జట్టు 28-19 పాయింట్ల తేడాతో విజయం సాధించినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పన్యాల శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జట్టును కళాశాల కరస్పాండెంట్ వి ఆగంరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ అభినందించారు.

మూడు కాలాలు ఆరు పంటలు



బంతి పూల తోట

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయం అంటే వరి అనేలా పరస్థితి ఉండేది.. ఇప్పుడిప్పుడే ఈ పరిస్థితులు మారుతున్నాయి.. పలువురు రైతులు వినూత్న సాగు పద్ధతులు పాటించి లాభాలు గడిస్తున్నారు. చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన తాటికొండ కుమార్ ఇలాంటి పద్ధతులే పాటిస్తున్నాడు. తన తండ్రి నుంచి సంక్రమించిన మూడెకరాల భూమిని ఆరు విభాగాలు విభజించాడు. ఆ భాగాల్లో సీజన్‌కు అనుగుణంగా కూరగాయలు, పూల తోటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాడు. ఈ ప్రాంతంలో ఎవ్వరూ వేయని బోడకాకరను పందిరి పద్ధ చేసి మంచి లాభాలు పొందాడు.



కాకరకాయ చేను



బీరకాయ తోట

- కొత్త పద్ధతుల్లో సాగు
- లాభాల పంట పండిస్తున్న యువ రైతు

చొప్పదండి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలం రుక్మాపూర్‌కు చెందిన యువ రైతు తాటికొండ కుమార్ మూస పద్ధతి సాగును వదిలి పెట్టాడు. తన తండ్రి మూడు ఎకరాల భూమిలో వరి సాగు చేస్తుండేవాడు. తండ్రి లాగే వ్యవసాయం చేస్తే లాభం ఉండదని గ్రహించాడు కుమార్. వినూత్నంగా ఆలోచించాడు. ఉన్న మూడు ఎకరాల భూమిని 20 గుంటలకు ఒకటిగా ఆరు విభాగాలుగా విభజించాడు. ఆరు రకాల పంటలను ఎంచుకుని సాగు చేపట్టాడు. పందిరి సాగు కింద మల్చింగ్, డ్రిప్ పద్ధతిలో బోడకాకర, కాకర, బీర కాయ, అలసంద, బంతిపూల సాగును చేపట్టాడు. అధిక లాభాలను పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

భరోసా కల్పించిన బంతి పూల సాగు

రెండు రకాల బంతి పూల సాగును ఎకరం చేనులో మల్చింగ్ విధానంలో సాగు చేశాడు. దసరాకు కొంత భాగం పూలను కోసి విక్రయించగా మరి కొంత దీపావళికి అమ్మేందుకు ప్రణాళిక బద్ధంగా పంట సాగు చేపట్టారు. అధిక దిగుబడితో బంతి సాగు లాభాల పంటగా మారింది.

బోడకాకర సాగుతో లాభల పంట

అతి తక్కువ మంది సాగు చేసే బోడకాకరను కుమార్ 20 గుంటల్లో నాటాడు. ఖర్చుతో కూడుకున్న బోడకాకర కాయ సాగును పందిరి సాగులో విధానంలో చేపట్టాడు. ఆయన కష్టానికి ఫలితం లభించి మంచి దిగుబడి వచ్చింది. తానే మార్కెట్‌కు తీసుకెళ్లి కిలోకు 200 రూపాయల చొప్పున అమ్మాడు. మంచి లాభాలు వచ్చాయి.

కూరగాయలకు డిమాండ్

పందిరి సాగు కింద కుమార్ బోడ కాకరతో పాటు కాకరకాయ, బీరకాయ సాగు చేపట్టాడు. ప్రస్తుతం ఈ మూడింటికి మార్కెట్‌లో మంచి ధర పలుకగా అలసంద కూడా మంచి దిగుబడి వచ్చింది. ధర కూడా కలిసి రావడంతో లాభాల పంట పండింది.

యాసంగిలోనూ కూరగాయల సాగు

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగు చేపడుతూ కుమార్ యాసంగిలో టమాటోతో పాటు ఇతర కూరగాయల సాగుకు సమాయత్తం అవుతున్నాడు. తక్కువ విస్తీర్ణంలో తక్కువ నీటితో అధిక లాభాలను ఇచ్చే పంటలను సాగు చేస్తూ లాభాలను గడుస్తున్న కుమార్ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.



బోడకాకర తోటలో రైతు కుమార్

న్యూస్ బాక్స్

1న కరీంనగర్‌కు బీసీ కమిషన్ బృందం రాక

సిరిసిల్ల అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్ల దమాషాను పేర్కొనే విషయంలో రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడానికి తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబరు 1న కరీంనగర్‌కు వస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు సంబంధించి నవంబరు 1న కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ కమిషనర్ల బృందం అభిప్రాయ సేకరణ జరపనున్నట్లు తెలిపారు. అభిప్రాయాలు, సలహాలు, సూచనలు, తెలియజేయాలనుకున్న వారు రాతపూర్వకంగా అభ్యంతరాలను నేరుగా తెలియజేయవచ్చని తెలిపారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

భగత్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్స్ కోర్సు (2 ఇయర్స్ డిఎంఐటి), డిప్లొమా ఇన్ అనస్తీషియా టెక్నీషియన్ కోర్సు (2 ఇయర్స్)లకు గాను ఇంటర్‌లో బైపీసీ చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బైపీసీ విద్యార్థులు లేనిచో ఎంపీసీ చదివిన వారి నుంచి కూడా దరఖాస్తులు తీసుకుంటామన్నారు. పూర్తి వివరాలు కళాశాల వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు. అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సందేహాల నివృత్తికి కళాశాల వేళల్లో సంప్రదిస్తే సిబ్బంది వివరాలు తెలియజేస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు.

మా భర్తలతో వెట్టి చాకిరి

- రాస్తారోకో చేసిన బెటాలియన్ పోలీస్ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు



సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో బైఠాయించిన పోలీస్‌ల కుటుంబీకులు

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసుల పేరుతో బెటాలియన్‌లో కూలీలుగా మార్చి వెట్టిచాకిరి చేయిస్తున్నారని వారి భార్యలతోపాటు కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం సిరిసిల్ల 17వ పోలీస్ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్ల భార్యలు, కుటుంబీకులు ప్లకార్డుల తో భర్తల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి న్యాయం చేయాలంటూ నిరసన తెలిపేందుకు వచ్చారు. అక్కడే మోహరించిన సిరిసిల్ల పోలీసులు అడ్డుకుని ప్లకార్డులను తీసుకున్నారు. దీంతో ఆగ్రహించిన వారందరూ ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగానికి తమ భర్తలు చేస్తున్న పనికి సంబంధం లేకుండా పోయిందన్నారు. పోలీస్ ఉద్యోగం పేరుతో బెటాలియన్‌లో కూలీ పనులు చేస్తున్నారని ఈ విషయాన్ని ఎవరికైనా చెప్పుకోవడానికి నామూషీగా ఉందన్నారు. తమ భర్తలకు ఎనలేని డ్యూటీలు వేసి కుటుంబంతో గడపకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయ పాలన లేకుండా డ్యూటీలను పోలీస్ అధికారులు వేయడం వలన తమ భర్తలు డ్యూటీ చేయాలంటే భయంతో వణికిపోతున్నారన్నారు. శుభకార్యాలు జరుపుకోవడానికి సెలవులను ఇవ్వకుండా అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని.. ఒకవేళ సెలవు తీసుకోవాలంటూ అధికారులకు లంచాలను ఇవ్వాల్సిందేనని అన్నారు. బెటాలియన్‌లో పనిచేసే వారు చనిపోతే కానిస్టేబుళ్లు అంత్యక్రియలు చేయాలని వాళ్లే డప్పుళ్లు కొట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అమలుచేస్తున్న పోలీస్ విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసి తమ భర్తలకు వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ సీఐ మొగిలి అక్కడికి చేరుకోని వారితో మాట్లాడి ఆందోళనలు చేయవద్దని చెప్పినా ఎవరు వినిపించుకోకపోవడంతో వారిని పోలీసులు బలవంతంగా పోలీస్ వాహనంలో ఎక్కించి సర్ధాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌కు తరలించారు. అక్కడి బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావుతో సమావేశాన్ని ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని బెటాలియన్‌లలో అమలు చేస్తున్న వాటిని ఇక్కడ కూడా అమలు చేసి విధులను అప్పగించడం జరుగుతుందని అన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదికలను అందిస్తామని తెలిపారు.

మహిళ అదృశ్యం

గంభీరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపేట గ్రామానికి చెందిన జక్కుల సుమలత అనే 35 ఏళ్ల మహిళ అదృశ్యమైంది. ఈ నెల 22న మంగళవారం సుమలతతో పాటు ఆమె భర్త రాజు ఎస్‌బీఐలో పనిమీద గంభీరావుపేట వచ్చారు. అయితే బ్యాంక్ బుక్ వేరే బ్యాంక్‌ది తేవడంతో సుమలతను బ్యాంక్ వద్దే ఉండమని భర్త రాజు ఎస్‌బీఐ పాస్ బుక్ కోసం దేశాయిపేటకు వెళ్లి తిరిగి వచ్చాడు. రాజు వచ్చే సరికి సుమలత బ్యాంక్ వద్ద లేకపోవడంతో ఆందోళనల చెందాడు. చుట్టు పక్కల, బస్టాండ్ ప్రాంతంలో గ్రామం అంతా వెతికినా సుమలత జాడ తెలియలేదు. సుమలత ఆచూకీ కోసం వారి బంధువులు కూడా గాలిస్తున్నారు. ఆందోళనతో సుమలత భర్త రాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వికసిత్ భారత్ సెమినార్ కరపత్రం ఆవిష్కరణ




కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం, అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ 2047 ఇండియా విజన్ ఫర్ డెవలప్‌మెంట్ అనే అంశంపై ఫిబ్రవరి 4, 5 తేదీల్లో 2025లో జరిగే రెండు రోజుల జాతీయ సెమినార్‌కు సంబంధించిన కరపత్రాలను వీసీ ఉమేష్ కుమార్ చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారతదేశం 2047వ సంవత్సరం నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే స్థిరమైన అభివృద్ధి అవసరమని ఉద్బోధించారు. అభివృద్ధి, పారదర్శకత వికసిత్ భారత్ లక్ష్యాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్ వివరించారు. సెమినార్ డైరెక్టర్ శ్రీవాణి మాట్లాడుతూ ప్రపంచంలోనే భారతదేశం అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా అవతరించాలనేదే వికసిత్ భారత్ 2047 యొక్క ముఖ్య లక్ష్యం అని వివరించారు. కార్యక్రమంలో డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్ సూరేపల్లి సుజాత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాఫర్ జరీ, డాక్టర్ కే. పద్మావతి, డాక్టర్ అబ్రహం బాకీ, డాక్టర్ ఉమేరా బేగం, డాక్టర్ నజీముద్దీన్ మునావర్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో నురగ

- శాంపిల్స్ సేకరించిన కాలుష్య నియంత్రణ మండలి



గోదావరినదిలో నురగలతో నీటి ప్రవాహం

కోల్‌సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, గోదావరిఖని వద్ద గురువారం గోదావరి నదిలో నురగులు కనిపించాయి. దీంతో పరివాహక ప్రాంత ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మహారాష్ట్రలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శ్రీరాంసాగర్ ప్రవాహం పెరగడంతో గోదావరిలోకి నీటిని వదిలారు. దీంతో మహారాష్ట్రలోని లిక్కర్ పరిశ్రమల వ్యర్థాలు గోదావరినదిలో కలువడం వల్ల ఈ నురగలు వస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గోదావరిఖని గోదావరి తీరంలోని పుష్కర ఘాట్ వద్ద నీటి శాంపిల్స్ సేకరించారు. గోదావరి తీరం వెంట ఎస్సారెస్పీ దిగువన సెప్టెంబరులో గణపతి నిమజ్జనం జరిగింది. ఆ రసాయనాల వల్ల కూడా నురుగు వచ్చే అవకాశం ఉందని, ప్రవాహ వేగం పెరిగిన సమయంలోనే ఇలా జరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



శాంపిల్స్ సేకరిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు

వెదురుబొంగులతో.. మినియేచర్స్





ప్రతి మనిషిలో ఏదో ఒక ప్రత్యేకత దాగి ఉంటుంది. తనలోని ప్రత్యేకతను గుర్తెరిగి దానికి పదును పెడితే అద్భుతాలు సృష్టించగలుగుతాడు. ఏ పని చేసినా, ఏవృత్తి చేపట్టినా సృజనాత్మకతతో కృషి చేస్తే అందరిలో ప్రత్యేకంగా నిలుస్తారు. తన శక్తి సామర్థ్యాలు పూర్తిగా వెచ్చించి కొత్త దనం కోసం కృషి చేసేవారు రికార్డులు సృష్టిస్తారు. రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన ఊరె నర్సయ్య అగ్గిపెట్టెలో ఇమిడే వెదురు బుట్టలు, చాట తయారీతో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు.

- అగ్గిపెట్టెలో ఇమిడే బుట్టలు, వ్యవసాయ పనిముట్లు
- ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న నర్సయ్య
- భూపతిపూర్‌వాసి ప్రతిభ

రాయికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన ఊరె నర్సయ్య తన కుల వృత్తి మ్యాదరి పని చేస్తూ ఖాళీ సమయంలో వెదురు బొంగులతో అద్భుత కళాకండాలను తయారు చేసి అబ్బురపరుస్తున్నాడు. అతను అగ్గిపెట్టెలో ఇమిడే వెదురు కళాకృతులను బుట్టలు, చాటలు తయారు చేసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. వ్యవసాయ సాగు విధానం, వరి వేయడం, ఒడ్లు చెక్కడం, గుంతలు తీయడం, గుల్లలు అల్లడం వంటి కళాకృతులు తయారు చేస్తున్నాడు. వెదురు బొంగులతో సోఫాలు తయారు చేయడం, వివిధ రకాలు కళాకృతులు తయారు చేయడంతో వాటిని చూడడానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆయన ఇంటికి వస్తుంటారు. ఇటీవల వినాయక చవితి వేడుకల్లో నర్సయ్య తయారు చేసిన చెక్క గణపతి గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కొత్తగా ప్రయత్నం చేశా...: ఊరె నర్సయ్య

కుల వృత్తి మ్యాదరి పని చేసుకుంటూ జీవిస్తాను. వెదురు బొంగులతో అందరిలా కాకుండా ఏదైనా కొత్తగా ఆవిష్కరించాలని ప్రయత్నం చేస్తుంటా. సిరిసిల్ల జిల్లాలో అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నేత కార్మికులు తయారు చేయడం తనకు స్ఫూర్తిని ఇచ్చింది. అందులో నుంచి పుట్టిన ఆలోచనతోనే అగ్గిపెట్టెలో ఇమిడే కళాకృతులు తయారు చేయాల ఆలోచన వచ్చింది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని నూతన ఆవిష్కరణలు చేస్తా.



న్యూస్ బాక్స్

విద్యార్థులకు అవగాహన

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో గురువారం మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. పొగాకు, గుట్కా, గుడుంబా, గంజాయి తదితర మత్తు పదార్థాలకు అలవాటు పడితే అనారోగ్యాలకు గురవుతామని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాస్, మహేందర్, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం సరోజన, ఆశాలు శారద, మౌనిక, భూలక్ష్మి, సరోజన పాల్గొన్నారు.

యువకుడికి సన్మానం

సుల్తానాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పీఈటీ ఉద్యోగం పొందిన కలువల వెంకటేశ్ అనే యువకుడిని స్థానిక వివేకానంద పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. పాఠశాల కరస్పాండెంట్ రవీందర్, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యవర్గ సభ్యుడిగా ఎన్నిక

ఓదెల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీలకుంటకు చెందిన బండారి రాజ్ కుమార్ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యునిగా ఎన్నికయ్యారు. గురువారం హైదరాబాద్‌లో మీసేవ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించగా, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 33మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నిక కాగా, ఇందులో ఓదెల మండలం జీలకుంటకు చెందిన మీసేవ ఆపరేటర్ రాజకుమార్ ఎన్నికవ్వడంపై మండలంలోని మీసేవ ఆపరేటర్లు హర్షం వ్యక్తం చేశారు.

ఠాణాను సందర్శించిన విద్యార్థులు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గురువారం పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన ఓపెన్ హౌస్‌లో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు పాల్గొన్నారు. ఏసీపీ జి. కృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐలు కొండపాక ప్రవీణ్‌కుమార్, సుబ్బారెడ్డి, ఎస్ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నూతన ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈవో మాధవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్టీపీసీలోని మిలీనియం బ్లాక్‌లో ఈనెల 26న ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరుకావాలని పేర్కొన్నారు. డీఎస్సీ 2024 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రిలీవ్ చేసి హాజరయ్యేట్లు చూడాలని తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మంథని, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో, మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పుట్ట శైలజ గురువారం పరామర్శించారు. పట్టణంలో చౌడారపు అమృతమ్మ మృతిచెందగా వారు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పుట్ట మధు వెంట బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.

ఇందిరమ్మ గృహాలు ఇప్పించాలి

కమాన్‌పూర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గుండారం, ధర్మారం గ్రామాల్లో వీరభద్రియ కులస్థులకు ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలని కోరుతూ గురువారం జిల్లా బీసీ వేల్ఫేర్ అధికారికి నాయకులు వినతిపత్రం సమర్పించారు. మల్యాల వీరయ్య, కడారి ఎల్లేష్, కడారి రవి, బాణాల వేణు, తిరుపతి, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

సాధారణ పౌరులకే 'ఫ్రెండ్లీ పోలీసింగ్'..

(5వ పేజీ తరువాయి)

ఘటనలో అధికార పార్టీ కౌన్సిలర్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేశాం. వాహనాలను సీజ్ చేశాం. కాల్ రికార్డులు తీసి ఈ ఘటనతో సంబంధం ఉన్న అందరినీ అరెస్టు చేశాం.

ఆంధ్రజ్యోతి : అక్రమ దందాలపై మీ వైఖరి ఏమిటి?

సీపీ : రామగుండం కమిషనరేట్‌లో గంజాయి, పేకాట, బియ్యం, ఇసుక అక్రమ రవాణా, అక్రమ ఫైనాన్స్‌లపై కఠిన వైఖరి అవలంభిస్తున్నాం. ఆంధ్ర నుంచి డబ్బులు తీసుకువచ్చి అక్రమ ఫైనాన్స్‌లు నడుపుతున్నారు. ఇక్కడ ఏజెంట్లను పెట్టి 10శాతం చొప్పున వడ్డీలకు ఇస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేశాం. ఇక్కడ చిరు వ్యాపారులు, కూలీలు, సింగరేణి కార్మికుల వద్ద నుంచి పెద్ద ఎత్తున వడ్డీలు వసూలుచేస్తున్నారు. 23కేసులు నమోదు చేసి 25మందిని అరెస్టు చేశాం. 60గంజాయి కేసుల్లో 43కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. 170మందిని అరెస్టు చేశాం. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై 105కేసులు నమోదు చేసి 160మందిని అరెస్టు చేశాం. ఇసుక అక్రమ రవాణాపై 94కేసులు నమోదు చేసి యంత్రాలు సీజ్ చేసి 212మందిని అరెస్టు చేశాం.

ఆంధ్రజ్యోతి : గంజాయి నియంత్రణకు చర్యలేవి..?

సీపీ : పల్లెలు, పట్టణాలు అనే తేడాల లేకుండా గంజాయి మహమ్మారి చొచ్చుకుపోయింది. గంజాయిని కట్టడి చేసేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాం. రవాణాకు సంబంధించిన లింకులు కట్ చేశాం. గంజాయికి బానిస అయిన వారు చందాలు పోగు చేసుకుని మహారాష్ట్ర, ఒరిస్సా బార్డర్‌కు వెళ్లి గంజాయి తెచ్చుకుంటున్నారు. గంజాయి నియంత్రణలో తల్లిదండ్రుల పాత్రే కీలకం. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ మహమ్మారిని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : జూదం, పేకాట నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీపీ : జూదం విషయంలో ఎవరికి మినహాయింపు లేదు. పెద్దపల్లి, మంచిర్యాల వంటి ప్రాంతాల్లో అధికారుల క్లబ్‌ల్లో కూడా జూదానికి అనుమతించడం లేదు. మంచిర్యాలలో లాడ్జిలనే సీజ్ చేశాం. ఒక అటవీ ప్రాంతంలో పేకాట నడుస్తోందని సమాచారం వస్తే టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మారువేషాల్లో వెళ్లి ఆపరేషన్ చేశారు. జూదం, వ్యభిచారం ఎక్కడ జరిగినా సంబంధిత లాడ్జిలను సీజ్ చేస్తాం.

ఆంధ్రజ్యోతి : టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ పనితీరు ఎలా ఉంది. ఎమైనా సిబ్బంది కొరత ఉందా?

సీపీ : సిబ్బంది కొరతతో టాస్క్‌ఫోర్స్ దాడులు తగ్గాయి. ఇప్పుడు పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్నారు. అక్రమ దందాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు ఉధృతం చేస్తాం. సీసీఎస్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోయాం. ప్రస్తుతం జరుగుతున్న నేర పరిశోధనలో సీసీఎస్ భాగస్వామ్యం ఉంది. మరింతగా వినియోగించుకుంటాం.

ఆంధ్రజ్యోతి : శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలేంటి?

సీపీ : మావోయిస్టులను పూర్తిస్థాయిలో కట్టడిచేశాం. ప్రత్యేక కూంబింగ్ జరుగుతోంది. గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పరిస్థితిని తెలుసుకునేందుకు పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టాం. ఎస్ఐ నుంచి సీపీ వరకు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. డ్రోన్ పెట్రోలింగ్ కార్యక్రమాన్ని చేపట్టబోతున్నాం. మొదటి దశలో పట్టణ ప్రాంతాల్లో డ్రోన్ పెట్రోలింగ్ ఉంటుంది. గణేష్ నిమజ్జనం, బక్రీద్ వంటి పండుగలకు ఈ డ్రోన్ సేవలను వినియోగించు కున్నాం. 'ఆపరేషన్ గరుడ'ను మరింత విస్తరిస్తాం.

'ఉపాధి' పెంపుపై దృష్టి

(5వ పేజీ తరువాయి)

మెటీరియల్ కంపొనెంట్ నిధులతో గ్రామాల్లో ఇప్పటి వరకు గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, రైతు వేదికల నిర్మాణాలు, మురికి కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేశారు. అలాగే సెగ్రిగేషన్ షెడ్లు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా విడుదల చేసే నిధులే తప్ప ఇతరత్రా రావడం లేదు. ఎమ్మెల్యేలు సీడీఎఫ్ ద్వారా, డీఎంఎఫ్‌టీ ద్వారా పనులు చేపడుతున్నారు. గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 30 కోట్ల వరకు శాశ్వత పనులకు వెచ్చిస్తున్నారు. ఉపాధిహామీ పనులకు పెద్దఎత్తున కూలీలు వచ్చే విధంగా ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది, మండల పరిషత్ అధికారులు ప్రోత్సహిస్తే మెటీరియల్ కంపోనెంట్ బడ్జెట్ పెరిగే అవకాశాలున్నాయి.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

సుల్తానాబాద్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కోసం అంకిత భావంతో పని చేసే వారికి ఎప్పటికైనా తగిన గుర్తింపు ఉంటుందని గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ అన్నారు. గురువారం సుల్తానాబాద్ పట్టణంలోని అన్నయ్య గౌడ్ నివాసంలో పెద్దపల్లి పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు అన్నయ్య గౌడ్‌ను సన్మానించారు. పార్టీని వీడకుండా పార్టీ కోసం పని చేసిన తనలాంటి కార్యకర్తలందరికి సముచిత స్థానం దక్కుతుందన్నారు. పెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భూషణవేణి సురేష్, ప్రధానకార్యదర్శి దొడ్డుపల్లి జగదీష్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు బండారి సునిల్, నాయకులు గంగుల సంతోష్, పడాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో కోతలు విధించొద్దు : ఎమ్మెల్యే



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లలో కోతలు విధించి వివిధ రకాలుగా రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నంతకాలం ధాన్యం కోతలు అనే పదానికి తావు ఇవ్వనని స్పష్టం చేశారు. ప్రస్తుత సీజన్ వడ్లను కొనుగోలు సందర్భంగా ఎక్కడైనా కటింగ్ చేస్తే చర్యలు తీకుకుంటానని హెచ్చరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప మినపాల ప్రకాష్‌రావు ఉప్పు రాజు, మందల సత్యనారాయణరెడ్డి, సజ్జాద్, బండారి రాంమూర్తి, సందనవేన రాజేందర్, ఒదెలు యాదవ్, కట్కూరి సుధాకర్‌రెడ్డి, నూగిళ్ళ మల్లయ్య, ఐలయ్య యాదవ్, బూతగడ్డ సంపత్, సయ్యద్ మస్రత్, బుషనవేన సురేష్‌గౌడ్, ఎరుకల రమేష్, అమ్రీష్ తదితరులున్నారు.

ఐక్యరాజ్య సమితిలో శాశ్వత సభ్యత్వం గర్వకారణం

మంథని, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశానికి ఐక్యరాజ్య సమితిలో శాశ్వత సభ్యత్వం లభించడం గర్వకారమని బీజేపీ నేతలు కొండపాక సత్యప్రకాష్, సబ్బని సంతోష్‌లు వెల్లడించారు. గురువారం వారు విలేకరులతో మాటాడారు. సమావేశంలో బీజేపీ నేతలు బోగోజు శ్రీనివాస్, రాపర్తి సంతోష్, చిలువేరి సతీష్, నాంపెల్లి రమేష్, శంకర్, లక్ష్మణ్, అశోక్‌లు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పాలకుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గురువారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. పుట్నూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, పాథమిక ఆరోగ్య కేంద్రం, కుక్కలగూడూర్ జడ్పీ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, జయ్యారం జడ్పీ పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలల్లో పిల్లలకు అందించే మధ్యాహ్నం భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం నాణ్యత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పుట్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న సేవలు, వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఔట్‌పేషంట్ సేవలను కచ్చితంగా అమలుచేయాలని, ఓపీ సమయాల్లో వైద్యులు పూర్తి సమయం అందుబాటులో ఉండాలన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్‌సీడీ సర్వే వివరాలను ఆరాతీశారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న హెల్త్ క్యాంప్‌ను తనిఖీ చేసి పేషెంట్‌లకు అందుతున్న వైద్య సేవలను అడిగి తగిన మందులు ఇవ్వాలని ఆదేశించారు. కాగా పుట్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్యం అందించాలని కోరుతూ గ్రామ యువకులు వైద్య నరేష్, తోట ప్రశాంత్, అంజి తదితరులు ఇటీవల కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన కలెక్టర్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటానని గతంలో ఇచ్చిన మాట ప్రకారం



లంబాడితండాలో ఉపాధ్యాయురాలితో మాట్లాడుతున్న కలెక్టర్

గురువారం పుట్నూర్ పీహెచ్‌సీ సందర్శించిన కలెక్టర్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

● అంతర్గాం (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని లంబాడితండాలోగల ప్రాథమిక పాఠశాలను గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి బోధన, మధ్యాహ్న భోజనం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టిక ఆహారం అందుతున్నాయా అని వాకబు చేశారు. అనంతరం రామగుండం ఐటీఐని సందర్శించి అందులోని మిషనరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎంఈవోకు సన్మానం

కమాన్‌పూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కుమార్‌గౌడ్‌ను గురువారం ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో చదువు వెంకట్‌రెడ్డి, వినయ్‌కుమార్, చదువు నరసింహారెడ్డిలు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ

ముత్తారం, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జిల్లాలపల్లె గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను గురువారం ఎంపీడీవో సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని విద్యను అందించాలని ఆయన కోరారు.

శానిటేషన్ పనుల పరిశీలన

ముత్తారం, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరిపురం గ్రామపంచాయతీ పరిధిలో గురువారం జరుగుతున్న శానిటేషన్ పనులను ఎంపీడీవో సురేష్ పరిశీలించారు. చెత్తాచెదారం ఉండకుండా సిబ్బంది పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

అంతర్గాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని 20వ డివిజన్ ప్రధాన కూడలి వద్ద గురువారం బీఆర్ఎస్ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ రామగుండం పట్టణ అధ్యక్షుడు బొద్దుపల్లి శ్రీనివాస్, ఉప్పరి లక్ష్మణ్, శివరాత్రి గంగాధర్, బదావత్ సారయ్య, సిరిపురం అశోక్, కలవేని మల్లేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

కమాన్‌పూర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజా సమస్యల వినతి పత్రాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో ధరణిపై వచ్చిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఎప్పటికప్పుడు జారీ చేయాలని, ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. వాసంతి, నాయబ్ తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, సీనియర్ సహాయకులు సతీష్, జూనియర్ సహాయకులు కిరణ్‌కుమార్ తదిత రులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

భూసేకరణ సమస్యలు సత్వరం పరిష్కరించాలి

రామగిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుధవారంపేట, రాజాపూర్ గ్రామాల్లో సింగరేణి కోసం చేపట్టిన భూసేకరణ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్ సూచించారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంబంధిత గ్రామాలకు ఎంజాయిమెంట్ సర్వే పూర్తి అయిన నేపథ్యంలో రైతులకు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశించారు. మండలంలోని మీ సేవ కేంద్రాల ద్వారా వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సకాలంలో వాటిని జారీ చేయాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ రాంచందర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

పట్టా పాస్ బుక్ ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలి

● మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టా పాస్ బుక్ ఉన్న ప్రతి రైతుకు 2 లక్షల రూపాయల పంట రుణ మాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ప్రభుత్వానికి సూచించారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్, రబీ రెండు సీజనులు పూర్తయినా రైతు బంధు నగదు చెల్లించలేదన్నారు. రాష్ట్రంలో రుణమాఫీ ఎంతమంది రైతులకు ఇచ్చారో ప్రకటించాలన్నారు. రేషన్ కార్డు లేదని, ఆదాయ పన్ను, తదితర కారణాలు చెప్పి అనేక మంది రైతులకు ప్రభుత్వం రుణమాఫీ ఎగ్గొట్టిందన్నారు. ఎన్నికల సందర్భంగా వరంగల్‌లో జరిగిన సమావేశంలో రాహుల్‌గాంధీ ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం తప్ప ఏ గ్యారెంటీ అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు పండించిన పంటను ప్రైవేటు దళారులకు అమ్ముకునే పరిస్థితి దాపురించిందని, కొనుగోలు సెంటర్ల ప్రారంభం పేరుతో ఎమ్మెల్యేలు కాలయాపన చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని గుజ్జుల డిమాండ్ చేశారు. రైతుబంధు, రైతుభరోసా పథకాలు అమలు చేస్తారా లేదా అని ప్రశ్నించారు.

ఈ సమావేశంలో బీజేపీ నాయకులు పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, ఠాకూర్ రాంసింగ్, శనిగరపు రమేష్, అక్కెపల్లి క్రాంతి, వెల్లంపల్లి శ్రీనివాసరావు, బెజ్జంకి దిలీప్ కుమార్, శివంగారి సతీష్, ఎండి ఫహీం, మొలుగూరి రాజవీరు, జంగ చక్రధర్ రెడ్డి, పెండ్యాల కరుణాకర్, పుట్ట రవి, పెండ్యాల కుమార్, కాసన గొట్టు విజయ్, ముస్త్యాల సంతోష్, కొమిరిశెట్టి రమేష్, శాతరాజు నరేష్, మోర మనోహర్, భూషనవేని శ్రీనివాస్, బండ కరుణాకర్, ఠాకూర్ సతీష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



కారుణ్య నియామక పత్రాలను అందజేసిన జీఎం



కారుణ్య నియామక పత్రాలను అందజేస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 పరిధిలో 18మందికి గురువారం కారుణ్య నియామక పత్రాలను జీఎం లలిత్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎండీ బలరాం నాయక్ చొరవతో డిపెండెంట్లకు త్వరితగతిన కారుణ్య నియామక పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే అన్‌ఫిట్ చేస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడం జరుగుతుందన్నారు. కొత్తగా ఉద్యోగంలో జాయిన్ అయ్యే వారు సీనియర్ల వద్ద పని నైపుణ్యాన్ని, మెళకువలు నేర్చుకుని సంస్థ పురోభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రాంమోహన్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు పాల్గొన్నారు.

● రామగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో ఉద్యోగం లభించడం అదృష్టంగా భావించాలని ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 31 మంది డిపెండెంట్‌లకు వీటీసీ శిక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సంస్థ ఇచ్చే శిక్షణను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విధులకు గైర్హాజరు కాకుండా సక్రమంగా చేసుకోవాలని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ భద్రతతో కూడిన విధులను చేసుకోవాలని సూచించారు. సింగరేణి సంస్థ పురోభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు, అధికారులు సత్యనారయణ, మల్లన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-2 అధికారుల తీరుతో ఇబ్బందులు

- ప్రైవేట్ స్థలాల్లోని ఆస్తుల ధ్వంసం



ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న కలప

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-2 యాజమాన్యం తీరుతో సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతుఆన్నరు. తన పరిధి కాని స్థలాల్లో చొరబడి ఆస్తులను ధ్వంసం చేస్తున్నది. స్థలాల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ఆర్జీ-2 అధికారుల తీరుతో సాధారణ వ్యక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు నెలల క్రితం కాలనీలోని పెట్రోల్ బంక్‌కు సంబంధించి మురుగు నీటి ట్యాంక్ కారణమని స్థానిక నాయకుడు చెప్పడంతో ముందు వెనకా చూడకుండా సదరు మురుగు నీటి ట్యాంక్‌ను ఆర్జీ-2 అధికారులు ధ్వంసం చేశారు. పెట్రోల్ బంక్‌లోకి వెళ్లే దారి తవ్వడంతో యజమాని తీవ్రంగా నష్టపోయాడు. తాజాగా రామగిరి మండలం ఉప్పర్ల కేసారం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 57, 122/ఏలో పది ఎకరాల్లోని నీలగిరి చెట్లను నరికివేసి తరలించారు. భూయజమాని అయిన గట్టు రాములు, అతడి కుటుంబ సభ్యులు తమ భూమిలో చెట్లను ఎలా నరికి తరలించుకుపోతారని సింగరేణి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిలో తమ అనుమతి లేకుండా, కనీస సమాచారం ఇవ్వకుండా నీలగిరి మొక్కలు నాటి తమ పంటలకు నష్టం చేశారని, కలెక్టర్‌కు గట్టు రాములు ఆయన కుటుంబ సభ్యులు గత ఏడాది మేలో ఫిర్యాదు చేశారు. దీనిపై ఈ ఏడాది ఏప్రిల్‌లో మండల సర్వేఅధికారి సింగరేణి అధికారులు, గట్టు రాములు కుటుంబ సభ్యుల సమక్షంలో సర్వే చేయగా, రాములు భూమిలోనే నీలగిరి చెట్లు నాటినట్లు నిర్ధారణ కావడంతో హద్దులు సైతం ఏర్పాటు చేశారు. అయితే బుధవారం, గురువారం సింగరేణి అధికారులు తమ భూమిలో అక్రమంగా చొరబడి చెట్లను నరికి తరలించుకుపోయారని, దీనిపై కలెక్టర్, సింగరేణి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, తమకు నష్టపరిహారం ఇప్పించాలని గట్టు రాములు కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

మత్స్య సహకార సంఘం ఎన్నికల ఫలితాలు విడుదల

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనారం, మంగపేట గ్రామ మత్స్య సహకార సంఘం ఎన్నికల ఫలితాలు పోలీస్ బందోబస్తు మధ్య ఎన్నికల అధికారులు ప్రకటించారు. 2022ఆగస్టు 1వ తేదీన కూనారం, మంగపేట గ్రామాల మత్స్య సహకార సంఘం ఎన్నికలు నిర్వహించగా హైకోర్టులో కొందరు పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ఉత్తర్వులు మేరకు అధికారులు ప్రక్రియను నిలిపివేశారు. తిరిగి ఇటీవల ఎన్నికల ఫలితాలు విడుదల చేయాలని కోర్టు ఆదేశించడంతో ఎన్నికల అధికారులు గురువారం కూనారం సింగిల్ విండో కార్యాలయంలో ఓట్ల లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన 9మంది డైరెక్టర్లకు ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎన్నికల ఫలితాలు విడుదల కావడంతో ముదిరాజ్ కులస్తులు బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు.

సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి సురేందర్‌రెడ్డి, ఎస్ఐలు, వెంకటేష్, నరేష్, ఏఎస్ఐ భాస్కర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాల బారినపడి మోసపోవద్దు..

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరస్థుల ఉచ్చులో పడి మోసపోవద్దని సీనియర్ సివిల్ జడ్జి స్వప్నరాణి అన్నారు. గురువారం మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి స్వప్నరాణి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అధ్యాపకులు బోధించే పాఠాలు, సమాజ సేవలో ఉండాల్సిన వాటిపై వివరిస్తారని వాటిని పాటిస్తూ జీవితాల్లో రాణించాలన్నారు. నేటి ప్రపంచంలో సైబర్ క్రైంల బారినపడి ఎంతో మంది మోసపోయారని, వాటి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండటంతోపాటు, పలువురికి వివరించాలన్నారు. సైబర్ నేరాల ద్వారా డబ్బులు పొగొట్టుకుంటే 1930 నెంబర్‌కి కాల్ చేసి వివరాలు అందించాలన్నారు. వాహనదారులు నడిపేవారు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపరాదన్నారు. న్యాయ సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100 ఏర్పాటు చేశారని కోర్టు పరిధిలో ఏవైనా సలహాలు, సూచనలు కావాలంటే ఫోన్ చేసి మాట్లాడ వచ్చన్నారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనర్సయ్య, న్యాయవాదులు హనుమాన్‌సింగ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అందరికి అండగా నిలుస్తుంది : ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. స్థానిక ఆర్కే గార్డెన్‌లో గురువారం సీఎమ్మాఎఫ్, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. నియోజకవర్గంలో 301 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ఎనభై లక్షల యాభై ఎనిమిది వేల రూపాయల విలువగల చెక్కులు పంపిణి చేశారు. అలాగే 115 మంది కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ లబ్ధిదారులకు కోటి పదిహేను లక్షల పదమూడు వేల ముడు వందల నలభై రూపాయల విలువ గల చెక్కులను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, పెద్దపల్లి మార్కెట్ చైర్మన్, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు రుచికరమైన అల్పాహారం అందించాలి

పాలకుర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కేశోరాం సిమెంటు కంపెనీలోని కార్మికులకు నాణ్యతతో కూడిన రుచికరమైన అల్పాహారం అందించాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక హరి అన్నారు. గురువారం ఆయన దీపావళి బోనస్‌పై కంపెనీ అధికారులతో చర్చించిన అనంతరం క్యాంటీన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీప గ్రామాల నుంచి ఇక్కడికి వచ్చి విధులు నిర్వహిస్తున్న ప్రతి కార్మికుడికి ఇచ్చే తేనీరు, అల్పాహారం విషయంలో రాజీ పడకుండా రుచికరమైన పదార్థాలను అందించాలని సదరు టేకేదారుకు సూచించారు. ఆయన వెంట యూనియన్ ప్రధానకార్యదర్శి మాదాసు శ్రీనివాస్, కంపెనీ అధికారులు, యూనియన్ కమిటీ సభ్యులున్నారు.